# నిస్సీ జయధ్వజము

విడి పత్రిక రూ 8/-

జూన్ - 2016 | క్రైస్తవ ఆధ్యాత్మిక మాస పత్రిక | సంవత్సరపు చందా రూ. 100/-


## పాడైపోయిన స్థలములను బాగుచేద్దాం

**“పూర్వకాలమునుండి పాడైపోయిన స్థలములను నీ జనులు కట్టెదరు. అనేక తరముల క్రిందట పాడైపోయిన పునాదులను నీవు మరల కట్టెదవు. విరుగబడినదానిని బాగుచేయువాడవనియు దేశములో నివసించునట్లుగా త్రోవలు సిద్ధపరచువాడవనియు నీకు పేరు పెట్టబడును. యెషయా 58:12.**

పై వాక్యభాగములో “పూర్వకాలము నుండి పాడైపోయిన స్థలములను నీ జనులు కట్టెదరు అని, నీజనులు బాగు చేస్తారు అని” చూస్తున్నాం. అసలు ఎలా పాడైపోయింది? ఎందుకు పాడైపోయింది? ఎప్పుడు పాడైపోయింది? అనే విషయాన్ని కొద్దిగా ఆలోచిద్దాము. ఈ స్థలము పూర్వకాలమున పాడైపోయింది. ఎప్పుడు? ఆదాము హవ్వలను సృష్టించకముందే ఒకడు పాడుచేసాడు. దేవుడు తనఅనాధి ప్రణాళికను ఆయన గొప్ప ఉద్ధేశ్యాన్ని ఈ భూమిపై జరిగించాలని మొదట దేవదూతలను ఏర్పాటు చేసాడు. అందులో లూసిఫర్ అనేవాడు ఒకడు. వాడు దేవుని ప్రణాళికను దేవుని ఆలోచనలు పాడుచేసి, దేవాతిదేవునికి పైగా హెచ్చించుకుని, సభాపర్వతం మీద కూర్చుని ఆరాధనలు స్తుతులు నేనే అనుభవించాలని ఒక పాపపు ఆలోచన వానియొక్క మనస్సులో పుట్టిన మరుక్షణం “పాడు” అనేది ప్రారంభమైంది. దేవునికి వ్యతిరేఖమైన ఆలోచన రాగానే దాన్ని దేవుడు గ్రహించి పాడు ఆలోచన వచ్చిన లూసిఫర్‌ను దేవుడు క్రిందికి త్రోసివేసాడు. వాడు పాడైపోయి మౌనంగా ఉన్నాడా? దేవుడు తనపోలికలో తన స్వారూప్యంలో సృష్టించిన మానవున్ని కూడా వాడు పాడుచేసాడు. అనగా పాడైనవాడు ఇంకొక వ్యక్తిని

పాడుచేయడానికే ప్రయత్నం చేస్తాడు కాని, బాగుచేసే ప్రయత్నంచేయడు. ఒక త్రాగుబోతు ఇంకొక త్రాగుబోతును తయారుచేస్తాడు. ఒక పేకాట ఆడేవాడు ఇంకొక పేకాట ఆడే వ్యక్తిని తయారు చేస్తాడు. పాపంచేసేవాడు మరొక వ్యక్తిని అదేపాపంలోనికి నడిపిస్తాడు. దుష్టుడైన సాతాను దేవుడు తన స్వహస్తాలతో చేసిన మానవున్ని కూడా పాడు చేసాడు. ఒకప్పుడు ఎంతో మహిమతో ఉన్న ఈ భూమిని  ఆకారం లేకుండా మారిపోయింది. వాడు ఈ మహిమగల భూమి మీద చేసినపాపాన్నిబట్టి ప్రపంచం పాడైపోయి, చెల్లాచెదురుగా, దేశాలన్నికూడా ముక్కచెక్కలుగా పడిఉన్నాయి. పాడు అనే పదానికి జనకుడు దుష్టుడు.

చక్కగాఉన్న ఆదాము హవ్వలను సాతాను పాపములో పడవేసి పాడుచేసాడు. దేవునికి దూరంచేసాడు. ఆ రోజునుండి అన్ని పాడు అవుతూనే వస్తున్నాయి. అందుకే దేవుడు ఎందుకు నేను నరులను సృజించాను అని తనలోతాను వేధన చెందినట్లుగా చూస్తున్నాం.  ప్రత్యేకంగా దేవుడు ఇంకా వేధన చెందడానికి కారణం దేవుని కుమారులు నరులకుమార్తెలతో సాంగత్యంచేసి ఉన్నతమైన స్థితిలో ఉన్నవారు కూడా పాడైపోయారు.

పురాతనకాలం నుండి పాడైపోతూ వస్తున్న ఈ లోకాన్ని నీ జనులు  అనగా ఆయన స్వరక్తమిచ్చి  సంపాధించిన ఆయన ప్రజలు పాడైన ప్రదేశాలను, పాడైపోయిన కుటుంబాలను, పాడైపోయిన వ్యక్తులను బాగుచేస్తారు అని పైవాక్యంలో చూస్తున్నాము. ఎవరు ఆ జనులు? యేసురక్తములో కడుగబడిన మనమే ఆ జనులం. మనలను  గురించే ప్రభువు మాట్లాడుతున్నాడు. మనం పాడైపోయిన స్థలాలను బాగుచేసేవారం. నీవు శాపంలో, పాపంలో బ్రతుకుతున్నప్పుడు దేవుడు నిన్ను వెదికి తన స్వరక్తమిచ్చి సంపాదించింది ఎందుకు అంటే పాడైన దానిని బాగుచేయడానికే. ఏదో ఆయన ఇచ్చిన రక్షణను పొందుకుని నీవు నీ కుటుంబం హాయిగా సంతోషంగా బ్రతకడానికి కాదు. దేవుడు నిన్ను ఎందుకు రక్షించాడు? దేవుడు నిన్ను ఎందుకు ఎన్నుకున్నాడు? ఎందుకు నిన్ను సంఘములో నాటాడు? దానికి ఒక ప్రణాళిక ఉంది. పాడైపోయిన స్థలాలను నీవు బాగుచేయాలి. దేవుడు నీకు ఒక పనిని ఒక బాధ్యతను అప్పగిస్తున్నాడు. పూర్వకాలం నుండి నాశనం అవుతూవస్తున్న ఈ స్థలాలను ఎవరు బాగుచేయాలి? నీవు బాగుచేయాలని నీ చేతికి ఈ పనిని అప్పగిస్తున్నాడు. అనేక తరములక్రిందట పాడైపోయిన పునాదులు నీవు కట్టాలి.  ఆదినుండి పాడైపోయి, కుళ్ళిపోయి, చెదలుపట్టి, నాశనమైపోయి, నివాసయోగ్యం లేకుండా ఎక్కడచూసిన విగ్రహారాధన శాపంపాపం, సినిమా థియేటర్లు, బార్‌షాప్‌లు, వ్యభిచారం, అన్యాయం, అక్రమాలు ఎక్కడాచూసినా భయంకరమైన సాతాను కార్యములు, ఈలోకంలో జరిగి లోకమంతా పాడైపోయి దేశమంతా, గ్రామాలన్ని పాడైపోయి ఉంటే నీవు మౌనంగా ఉండడం దేవునికి ఇష్టమా? కాదు. దేవుడు నిన్ను ఎందుకు ఎన్నుకున్నాడు? ఎందుకు ఆయన సంఘంలో

నాటాడు? అనే విషయం నీకు తెలిస్తే బాధ్యతగల విశ్వాసిగా, సేవకునిగా మారిపోతావు. ఈరోజు దేవునిప్రజలకు వారు నివసించే ఊరుపాడైపోయినా, కుటుంబసభ్యులు పాడైపోయినా, వారి పిల్లలు విచ్చలవిడిగా తిరుగుతున్నా వారికి బాధలేదు. హాయిగా తింటున్నారు, వారిపనులు వారు చేసుకుంటున్నారు. టీవీల దగ్గర కాలక్షేపం చేస్తున్నారు. రోజు వేలమంది ప్రజలు చనిపోతూఉంటే నీ ముందే నీ కూతురు, కుమారుడు మాటవినకుండా తిరుగుతూవుంటే నీ భర్త త్రాగివచ్చి రోజునిన్ను హింసిస్తుంటే నీకు తినడానికి, పడుకోడానికి ఎలా మనస్సు వస్తుంది? నీకు ఈ లోకంలో ఏదో సంపాదించాలి, ఈ లోకమే శాశ్వతం ఈ లోక సుఖభోగాలను అనుభవించాలనే మనస్సు నీకు ఎలా వస్తుంది? యేసుప్రభువును నమ్మకుండానే రోజు కొన్ని లక్షలమంది నరకానికి వెళ్తున్నారు. మరి వీరి సంగతి ఏమిటి?

మనకు తెలిసింది ఒకటే సేవచేయడం సేవకులపని, సువార్త ప్రకటించడం, ఆత్మలను రక్షించడం, సంఘాలను కట్టడం సేవకులపని. మన పని ఏమిలేదు ఉద్యోగం చేసుకోవాలి వచ్చిన జీతాలతో సంతోషంగా ఉండాలి. ఇదే మనకు తెలిసిన విషయం. అసలు ప్రభువు నిన్ను ఎందుకు రక్షించాడు? నీ పట్ల దేవునియొక్క ఉద్దేశమేమిటి? నీ ద్వారా ఏకార్యం జరగాలని ప్రభువు ఆశిస్తున్నాడు? అని గమనించాలి. నిన్ను ఎన్నుకోవడానికి దేవునికి ప్రత్యేకమైన ఆలోచన ఉంది. అదే పాడైన స్థలాలను బాగుచేయాలని, నీవు నీ గ్రామాన్ని పట్టణాన్ని మార్చాలని దేవుడు మొట్టమొదట నీ కుటుంబములో నిన్ను ఎన్నుకున్నాడు. నీ ఉద్యోగం నీవు చేసుకో, నీ వ్యాపారం, నీ పనులు నీవుచేసుకో తప్పేమికాదు. కాని మిగతా సమయమంతా ఆత్మలరక్షణార్థమై బయలుదేరు. ఈనాడు అనేకులు వారి ఉద్యోగాలను చేస్తూ సమయం దొరికినప్పుడల్లా సువార్త చెప్పడానికి బయలుదేరుతున్నారు. అలా వారు ఎంతోమందిని రక్షిస్తున్నారు. వారిని నేను అడిగాను మీరు సేవచేస్తున్నారా? అంటేవారు లేదండి నేను ఒక కంపనీలో ఉద్యోగం చేస్తాను. నెలకి రూ॥ 7000/- జీతము ఇస్తారు. సమయం దొరికినప్పుడు ఈ విధంగా నేను కరపత్రికలను పంచుతూ ఉంటానండి అని చెప్పాడు. చూడండి! ఆ 7వేల జీతంలోనే పిల్లల్ని చదివిస్తూ ఇంటి కిరాయి చెల్లిస్తూ, ఇంటి ఖర్చులు భరిస్తూ సువార్తను ప్రకటిస్తున్నాడు. మరొక వ్యక్తి చెప్పినసాక్ష్యము 5వేల జీతంతో కుటుంబాన్ని పోషిస్తూ మిగతా సమయమంతా మందిరములో పరిచర్యచేస్తూ సేవకులతో కలిసి సువార్తకూడికల్లో తిరుగుతూ ఉంటాడు.

ఈరోజు నీవు ఏంచేస్తున్నావు? దేవుడు నీకు 20, 30వేల రూపాయల జీతాన్ని ఇస్తున్నాడు. మంచివ్యాపారం, పొలాలు అన్ని దేవుడు ఇస్తున్నాడు. దేవుడు నిన్ను ఒక ఉన్నతమైనస్థానములో పెడితే నీవు ఏమిచేస్తున్నావు? ఈలోక సంబంధమైనవాటి మీదనే ఆలోచనలు పెట్టి ఆత్మల సంపాధన మరచిపోతున్నావు. పరిశుద్ధాత్మ దేవుడు నీ కర్తవ్యాన్ని నీకు గుర్తు చెస్తున్నాడు. నేను నిన్ను ఎందుకు రక్షించానో తెలుసా? ఎందుకు నిన్ను జీవము కలిగిన

సంఘములో చేర్చానో తెలుసా? నీవు నీ గ్రామాన్ని నీ స్నేహితులను మార్చి పాడైపోయిన వారిని నీవు బాగుచేస్తావని ఈ బాధ్యతను నీకు అనుగ్రహించాను. ఆత్మల్ని రక్షించేపని కేవలం సేవకులదే కాదు ఆపని రక్షింపబడిన ప్రతిఒక్కరిది. అందరు యేసయ్యయొక్క మహిమను ఈ లోకములో చాటిచెప్పాలి. యేసయ్య మహోన్నతుడని శాపంపాపం నుండి విడిపిస్తాడని నీ గ్రామములో నీ పట్టణములో సజీవసాక్షిగా నిలబడి సువార్తచెప్పి, కొన్ని ఆత్మలనైనా ప్రభువు దగ్గరకు తీసుకురావాలి. ఈ సంవత్సరములో ఎంతమందికి సువార్త చెప్పావు? ఎంతమందిని మందిరానికి నడిపించావు? నీ మట్టుకు నీవే రక్షణ అనుభవిస్తున్నావా? లేక నీతోటివారికి నీ గ్రామస్తులకు నీ బంధువులకు సువార్త చెప్పివారిని రక్షణ అనుభవములోనికి తీసుకువస్తున్నావా? ఒకసారి ఆలోచించు! నీవు యేసయ్యను గూర్చి సువార్త చెప్పనియెడల ఒక దినమున యేసుప్రభువు యెదుట సిగ్గుపడుతూ నిలబడవలసిన పరిస్థితి వస్తుంది. ఎందుకో తెలుసా? పరలోకం వెళ్లిన తర్వాత నీవు నాకోసం ఏమి సంపాదించావు? అని అడిగితే ఏమని సమాధానమిస్తావు? బంగారం, వెండి, వజ్రాలు, భూములు తీసుకువచ్చాను, ఇంకా భూలోకంలో ఇల్లు కట్టాను అని అంటే భలా! నమ్మకస్తుడా!, నమ్మకస్తురాలా ఈ కొద్దిలో నీవు నమ్మకంగా ఉన్నావు గనుక ఈ పరలోకరాజ్యం స్వతంత్రించుకో అంటాడా? లేదా ప్రభువా నేను భూలోకంలో ఉన్నప్పుడు  శపించబడిన అనుభవాల్లో ఉన్న నన్ను మీరు రక్షించారు, ఇదిగో ఈ రక్షణపాత్రను చేతబట్టి నశించిపోయే ఆత్మల కోసం ప్రార్థనచేసి, మా కాలనీవారికి, మా ఊరివారికి సువార్త చెప్పి వీరందరిని నేను రక్షణలోనికి నడిపించాను. వీరిని సంపాదించి మీ దగ్గరకు తీసుకువచ్చాను అని అంటావా? బంగారం తెచ్చాను  ఆస్తులు తెచ్చాను అంటావా? రేపు ప్రభువు అడిగే ప్రశ్నకు జవాబుకు ఈలోకంలోనే సిద్దపడు. గొఱ్ఱె గొఱ్ఱెను కంటుంది. కననియెడల ఆ గొఱ్ఱె గొడ్రాలు అవుతుంది. విశ్వాసియైన నీవు ఆన్మలకు సువార్త చెప్పి ఆత్మలకు జన్మనివ్వాలి. నెలకు ఒక్కరిని కంటావా? సంవత్సరానికి ఒక్కరిని కంటావా? నీకు సామర్థ్యం దేవుడు ఎంత ఇచ్చాడు? నీ శక్తి సామర్థ్యము కృపావరములను బట్టి ఆత్మలపంటకోయాలి.

నా జనులు పాడైపోయిన స్థలాలను కడతారని ప్రభువు అంటున్నాడు. కొందరు ఎవరిని బాగుచేయరు? వారు బాగుపడరు. వీరి ఇంట్లో ఎప్పుడు గొడవలే. పిల్లలతో తల్లిదండ్రులకు, తల్లిదండ్రులతో పిల్లలకు గొడవలే. కుటుంబములో సమాధానము నెమ్మది ఉండదు. వారి ఇల్లే పాడైనట్లుగా ఉంటుంది. నీ ఇల్లే పాడైన ఇల్లుగా ఉంటే నీవు ఇంకొకరి ఇంటిని ఎలా బాగుచేస్తావు? అందుకే మొదట నీ యిల్లును బాగుచేసుకో. నీ ఇల్లు పాడవడానికి కారణం నీ ఇంటిలో పరిశుద్ధాత్మ దేవునికి స్థానం ఇవ్వలేదు, ప్రార్థనకు స్థానమివ్వలేదు. కాని టీవిలలో సినిమాలు చూడడానికి స్థానమిచ్చావు.

అందుకే ప్రభువు అంటున్నాడు నా కుమారుడా! నా కుమార్తె! నీ కిచ్చిన రక్షణ

చేతపట్టుకొని అనేకులకు సువార్త ప్రకటించి పాడైపోయిన స్థలాలను నీవు బాగుచేయాలి. అందుకనే దేవుడు నిన్ను నన్ను ఎన్నుకున్నాడు. నీవు ఉద్యోగంలో సువార్త చెప్పు ఆఫీసులో సువార్త ప్రకటించు. అలా చేయక ప్రార్థనచేయకుండా, పట్టణాలనిమిత్తమై భారం గుండెల్లో లేక చచ్చుబడ్డవారై లోకసంబంధ ఆలోచనలతో కలిసిపోయి జీవితాన్ని కొనసాగించడం దైవచిత్తము కాదు. ఇప్పటివరకు నీ పాతజీవితం చాలు ఇదిమొదలుకొని నీవు నూతన పరచబడి నీవు ఏస్థలంలో ఉన్నావో ఆ స్థలంలో సాక్ష్యంచెప్పి కొన్ని ఆత్మలనైనా రక్షణలోనికి నడిపించడానికి ప్రయాసపడు. నీ ఆస్తి అంతస్తు విలువైనవి కావు. నశించిపోతున్న ఆత్మలే విలువైనవి. వాటిని రక్షించుటకై ప్రాకులాడు. వాటిని సాతాను చేతిలోనుండి విడిపించడానికి రాత్రిపగలు ప్రయాసపడు. నిన్ను ఎక్కడికో వెళ్ళి నీ సాక్ష్యాన్ని చెప్పమని అడగడం లేదు నీవు వున్న గ్రామంలోనే కాలనీలోనే ఉన్నవారికి సాక్ష్యాన్ని చెప్పు. నీవు అయ్యా నా సాక్ష్యం ఎవరువింటారని నీవు అంటావేమో నీవు ప్రార్థనపూర్వకంగా బయటకువెళ్ళితే నీ సాక్ష్యం తప్పకుండా వింటారు. నీ సాక్ష్యాన్ని విని మరుసటి ఆదివారము రోజున నీతోపాటు మందిరానికి వస్తారు.

దేవుడు తన స్వరక్తమిచ్చి మనల్ని సంపాదించి రక్షణను ఇచ్చాడు. సమయాన్ని వృధాపర్చక సద్వినియోగం చేసుకుందాం. బయటకు వెళ్లడానికి వీలులేదా? అయితే ప్రార్థించు! ప్రభువా నేను సువార్త ప్రకటించడానికి వెళ్లలేకపోతున్నాను. వెళ్ళేవారిని బలపరచండి, వారిని వాడుకొనండి. వారిద్వారా కొన్ని ఆత్మలను రక్షించు ప్రభువా అని ప్రార్థించు. చాలు నీ ప్రార్థన వెళ్ళిన ఆ వ్యక్తిని బలపరుస్తుంది. అతనిద్వారా కొన్ని ఆత్మలను రక్షణలోనికి పరిశుద్ధాత్మదేవుడు తీసుకువస్తాడు. నీవు ప్రార్థించావు గనుక ఆవ్యక్తిని ప్రభువు వాడుకున్నాడు. వారిని దేవుడు రక్షించాడు. ప్రార్థించిన నీకు తప్పక ప్రతిఫలం దొరుకుతుంది. నీ సొంతకార్యాలకు ఎంత సమయం ఇస్తున్నావు. సువార్తకు ఎంత సమయం ఇస్తున్నావు? వెళ్ళగలిగితే బయటికివెళ్ళి సువార్త చెప్పు. ఇవి ఒకేదగ్గర ఉండి పనిచేసే దినాలు కావు. ఆత్మలరక్షణకై పరుగెత్తే దినాలు. అపోస్తలులు పరుగెత్తి పరుగెత్తి సువార్తను ప్రకటించారు. గ్రామాలు మండలాలు జిల్లాలు మార్చడానికి పరుగెత్తాడు అపో॥పౌలు.

గెహాజికూడ పరుగెత్తాడు ఆస్తికోసం అంతస్తుకోసం. పరుగెత్తి పరుగెత్తి కుష్టురోగాన్ని కొని తెచ్చుకున్నాడు. ఈలోక సంపదలు ఈలోకము శాశ్వతమైనవి కావు. ఇక్కడ ఉండేది కొద్దికాలమే ఈ కొద్ది సమయాన్ని ప్రభువు సువార్తకై హెచ్చిద్దాం. ఏ విధముచేతనైన దేవుని రాజ్యాన్ని ఈలోకంలో కట్టడానికి సేవకులు, విశ్వాసులు రాత్రిపగలు కష్టపడాలి. సాతానురాజ్యాన్ని వానిప్రాకారాలను కూల్చివేసి వాడు పాడుచేసిన స్థలాలను తిరిగి నూతనపరచి నూతన నిర్మాణంతో కట్టవలసిన బాధ్యత దేవుడు మనభుజముల మీద పెట్టాడు. పాడైన మన కుటుంబాలు బాగుచేసుకోవాలి, పాడైన మన గ్రామాలు బాగుచేసుకోవాలి. పాడైన మన

దేశాన్ని బాగుచేసుకోవాలి. 125కోట్ల జనాబాతో నిండియున్న మనదేశం విగ్రహారాధన భయంకరంగా జరుగుతుండగా సాతానుకు బలులు ఇవ్వడంద్వారా ప్రతిరోజు రక్తం ఏరులై పారుతుంటే మనుష్యులను కూడా సాతానుకు బలి ఇస్తుంటే ఎలా మనకు నిద్రపడ్తుంది? అందుకే గుండెల్లో ఆత్మల భారాన్ని పెంచుదాం. పాడైన స్థలాలను బాగుచేసే విశ్వాసిగా, సేవకునిగా దేవుని సన్నిధిలో నిలబడదాం.

నీవు పాడైన స్థలాలను మనుష్యులను బాగుచేస్తే దేవుడు నీకు ఒక క్రొత్త పేరు పెడ్తున్నాడు. పాడైపోయేదానిని బాగుచేసే సేవకునిగా, విశ్వాసిగా నీవు ప్రభువు దృష్టిలో కనిపిస్తే ఎవరికి తెలియని ఒక క్రొత్తపేరు నీకు పెడ్తున్నాడు. ఎందుకు పెడ్తున్నాడంటే ఆయన భారాన్ని నీ భారంగా భావించావు. ఆయన శ్రమను నీ శ్రమగా, ఆయన పనిని నీ పనిగా భావించావు గనుక బాప్తీస్మంపొందినప్పుడు పెట్టినపేరుకాదు నూతనమైనపేరు నీకు పెట్టుచున్నాడు. నీవు ఎప్పుడైతే దేశాన్ని గ్రామాన్ని పట్టణాలను బాగుచేయడానికి నడుముకట్టావో ఆ ప్రాంతమంతా ఆశీర్వాదకరంగా మారిపోతుంది.

**"అప్పుడు యెహోవానైన నేను పాడైపోయిన స్థలములను కట్టువాడననియు, పాడైపోయిన స్థలములలో చెట్లను నాటువాడననియు మీ చుట్టు శేషించిన అన్యజనులు తెలిసికొందురు. యెహోవానైనా నేను మాట ఇచ్చియున్నాను. నేను దాని నెరవేర్తును". యెహెజ్కేలు 36:36.**

దేశమంతా పాడైపోయింది. ఎడారిగా మారిపోయింది. ప్రజలందరు నశించిపోయి నాశనమైపోయి అరణ్యంవలె భయంకరమైన ప్రదేశంగా దేశమంతా మారింది. ఎక్కడ పవిత్రతలేదు,ఎక్కడచూసినా పాపం, ఏ ఇంటిలోచూసినా శాపం. అంత ఎడారిగా అరణ్యంగా మారిపోయింది. ఎక్కడ పరిశుద్దత నెమ్మది, శాంతి, సమాధానములేదు. ఎక్కడా చూసినా పాపముతో నిండిపోయింది. పాపమున్న స్థలములో మరణం ఉంటుంది. రకరకాలైన భయంకరమైన రోగాలు ఉంటాయి. వీటితో స్థలమంతానిండి ఎండుదిబ్బగా మారింది.

పాడైన స్థలములో నేను పచ్చనిచెట్లు నాటుతాను అని ప్రభువు అంటున్నాడు. ఒకసారి చెట్టును గమనించండి. పచ్చగా ఉంటుంది. ఈ పచ్చదనం ఆశీర్వాదానికి సూచనగా ఉంది. పాడైపోయిన స్థలాలు నిర్జీవంగా ఉన్న స్థలాలు, కరువుతో పాపంతో, నాశనం అయిపోయిన ఈ స్థలాలను ఆశీర్వాదపు స్థలాలుగా దీవెనకరమైన స్థలాలుగా మారుస్తాడు. అంటే దీవెనకరమైన కుటుంబాలుగా దీవెనకరమైన దేశముగా మన ప్రాంతాలను దేవుడు మారుస్తాడు. ఒకప్పుడు పాపంతో, విగ్రహారాధనతో, శాపంతో ఆ ప్రాతాలన్ని పాడైపోయాయి. పాడైన స్థలాన్ని ఆశీర్వాదపు స్థలంగా దేవుడు మారుస్తున్నాడు. దీవెన కరమైన స్థలాలుగా మార్చి అక్కడ ఉన్న శాపమును, పాపమును, విగ్రహారాధనను, అపవిత్రతను కొట్టివేస్తున్నాడు.

ప్రియమైన దైవజనాంగమా! ఈ రోజుల్లో ఎక్కడ చూసినా సువార్తికులు బయలుదేరి

ఆ ప్రాంతంలో సంఘాలు కట్టి, ఒకప్పుడు భయంకరమైన స్థితిలో ఉన్న గ్రామాలు చీకటితో శాపాన్ని అనుభవిస్తూ నిర్మానుష్యంగా మారిపోయిన గ్రామాలు ఈరోజు కాపరులు, అపోస్తలులు వెళ్లడం వలన ఆ ప్రాంతాలు పచ్చని స్థలాలుగా (ఆశీర్వదింపబడిన కుటుంబాలుగా) మారిపోతున్నాయి. నీ ప్రాంతం పట్ల ఒక భారాన్నికలిగి ఉండాలి, ప్రసవ వేధన పడాలి, పట్టణాలను, జిల్లాలను మార్చుకోవాలి. ఈ సువార్త అంతట ప్రకటించి నశించిపోతున్న ఆత్మలను సాతాను చేతిలోనుండి విడిపించి అనేకులకు నీడగా (ఆశీర్వాదకరంగా) బ్రతుకుదాము.

**"పాడైన భూమి ఏదేను వనమువలె ఆయెనని, పాడుగాను నిర్జనముగానున్న యీపట్టణములు నివాసులతో నిండి ప్రాకారములు గలవాయెననియు జనులు చెప్పుదురు.'' యెహెజ్కేలు 36:35.**

నీ ద్వార నీ ప్రాంతమంతా కూడా ఏదేనువనంవలె మారిపోవాలి. అలాగున జరుగును గాక! ఏదేనులో అన్ని జంతువులు అది సింహమైన, గొర్రెయైనా, పులియైనా, కుందేలలైనా అన్ని జంతువులు ఒకదానికొకటి సమాధానంగా ఉన్నాయి. అక్కడ కోపాలులేవు, ద్వేషాలు, గొడవలు, మనస్పర్థలు లేవు. శాంతి సమాధానంతో ఏదేను వనం ఉంది. ఈరోజు నీవు సువార్తను ప్రకటించిన అనేకులు ప్రభువైపు తిరిగితే అక్కడ గొడవలు ఆగిపోతాయి. నీవు ఈ సువార్తను ప్రజలమధ్యలో ప్రకటించు! ప్రజలు ఎందుకు మారరు? యేసయ్య ప్రేమముందు మారనివాడు ఈ ప్రపంచంలో ఎవరైనా ఉన్నారా? ఎంత రాతిగుండెనైనా కరిగించగల శక్తి యేసుప్రభువు ప్రేమకు ఉంది. యేసయ్యత్యాగం యెదుట ఎంతటి భయంకరమైన వ్యక్తియైన బంధిపోటు, దొంగయైనా నరహంతకుడైనా కౄరుడైనా యేసయ్య ప్రేమముందు నమస్కారం చేయాల్సిందే. ఆయన ప్రేమముందు ప్రతిఒక్కరు మోకరించవల్సిందే.

ప్రియదైవజనాంగమా! ప్రభువు నీ భుజాలమీదపెట్టిన భారాన్ని ఒక్కసారి జ్ఞాపకం చేసుకో. నీవు ఇది సేవకుల పని అని అనుకుంటున్నావు. కాదు ఇది అందరిపని, ఈదేశాన్ని కాపాడడం అందరి పని, అది మన బాధ్యతయైయున్నది. పాడైన స్థలాలను బాగుచేసి ఒకనూతనమైన క్రొత్తపేరు పెట్టబడిన వారమై దేవుని సన్నిధిలో మంచిమనస్సాక్షి కలిగిన విశ్వాసిగా సేవకునిగా నిలబడి, మన సమయమంతా ప్రభుసేవలో ఖర్చుచేసి దేవుని దగ్గరకు వెళ్లి భళా! నమ్మకమైన దాసుడా! నీవు నమ్మకంగా ఉంటివి, ఇదిగో నేనిచ్చే రాజ్యాన్ని బహుమతిని స్వీకరించు అని గొప్ప ప్రఖ్యాతిని పొంది దేవుని రాజ్యంలో యుగయుగాలు జీవించుదాం.

**దేవుడు మిమ్మల్ని దీవించునుగాక.**
**ఆమేన్.**

# గమనిక

అనివార్యకారణములను బట్టి
జూలై నెలలో జరిగే బైబిల్ సెమినార్‌ను
సెప్టెంబరు నెలకు మార్చడమైనది.
ఈ చిన్న మార్పును పాఠకులందరూ గమనించి
సహృదయముతో మాకు సహకరించాలని
కోరుచున్నాము.

# నిస్సీ

## పాటల సి.డి.లు

1. నా దాగుచోటు నీవే
2. మహోఘనుడా
3. ఇంపైన సువాసన
4. కృతజ్ఞతార్పణలు
5. నా గమ్యము నూతన
   యెరుషలేము
6. ఇశ్రాయేలు దేవా NEW
7. స్తోత్రార్పణ NEW

## ప్రసంగముల ఆడియో సి.డి.లు

1. పాపములో మరణించుట
2 .పరిశుద్ధత గుర్చి దర్శనము
3 .రమ్యమైన గుడారము
4 .దహించు అగ్ని
5 .ఆమె దీపము ఆరిపోదు
6. బలవంతుని చేతిలో
7. నా క్షేమానికి ఆధారం
8. నీవేమి ధరించితివి
9. పక్షి రాజు
10. అగ్ని జ్వాలలు
11. దీన మనస్సు తో చేసిన ప్రార్థన
12. దైవ నడిపింపు
13. అంజూరపు చెట్టు
14. పరలోకపు అగ్ని , పాతాళపు అగ్ని
15. కలత చెందనివాడు
16. ఉధ్యానవనము
17. సిద్ధపాటు
18. క్షయభీజము అక్షయ భీజము
19. ఎండిన ఎడారిలో లేతమొక్క
20. గోపురము
21.జయము మనదే
22. లెబనోను సౌంధర్యం
23. దైవజనుని మాట వినుట

## విసిడిలు మరియు డివిడిలు

1. నేను మీకు క్షేమము కలుగజేసెదను
2. మలిన వస్త్రాలు
3. నాకు దీవెన దయచేయుము
4. నీ సూర్యుడికను అస్తమింపడు
5. ధైర్యము తెచ్చుకొనుము
6. నిరీక్షణ 7. నిన్ను నడిపించును
8. సౌందర్యము 9. ఐక్యత
10. ఆలోచన 11.సిలువను మోయుట
12. జయించిన వారికి ఆశీర్వాదము
13. నీకురాజుఎవరు ?

పాటల సి.డి ఒక్కటి 50రూ॥. ప్రసంగములు ఒక్కటి 30రూ॥ విసిడి, డివిడి ఒక్కటి 50రూ॥లు కావలసినవారు పోస్టు ద్వారా మనియార్డరు పంపి వీటిని పొందగలరు. పోస్టల్‌చార్జీలు అదనం. మా అడ్రస్ ...

**Nissi Ministries, H.No. 1-3-132/A6**
**ShastriNagar, Nirmal, Adilabad. 504106**
**Phone:08734-240147, 9390011485**

*మీ ప్రార్థనా అవసరతలకొరకు సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు*

**08734-240147**

ఈ పరిచర్య నిమిత్తం కానుకలను, చెక్కులను, డిడిలను
ఈ క్రింది అడ్రస్సుకు పంపగలరు.

M.Jayaraj SBI- Branch: Nirmal A/c No: 31665876753

# సాక్ష్యము

# నా యేసే నాకు హీరో

నా పేరు  డేవిడ్ (నవీన్‌కుమార్) గ్రామము సిరిపెల్లి, మం॥ కుభీర్. ఒక హైందవ కుటుంబములో జన్మించాను. మేము చాల నిష్టతో కూడిన విగ్రహారాధన చేసేవారము. అలాంటి అన్యకుటుంబంలో జన్మించిన నాకు భక్తి అంటే చాలా ఇష్టం. నేను కూడా నా తల్లిదండ్రులతోపాటు ప్రతిరోజు నిష్టగా పూజలు చేసేవాన్ని. నేను 10వ తరగతి చదువుతున్న దినాలలో చేతబడి శక్తుల ప్రభావం మా అమ్మ నాన్నలమీద పడింది. ప్రతి అమావాస్య పూర్ణమికి భయంకరంగా శోధనతో ఏడుస్తూ ఉండేది. నేను ఒక మంచి చదువుకున్న కుటుంబములో ఉన్నాను. నాన్న ఒక గవర్నమెంట్ ఉద్యోగి ఈ పరిస్థితులను చూడగానే నాకు ఆశ్చర్యం కలిగేది. ఇలా రోజులు గడచిన తర్వాత చేతబడి శక్తుల ప్రభావం నా మీదకూడా పడింది. నా చదువు కోనసాగకుండా జ్ఞాపకశక్తి కోల్పోయేటట్లుగా చేసాయి. నేను చదువుల్లో చాలా కష్టపడేవాన్ని కాని అనుకున్న మార్కులు వచ్చేవికావు. 10వతరగతి, ఇంటర్‌మీడియట్ ద్వారా చాలా నిరాశకు లోనైపోయాను. నేను ఎందుకు ఇలా అవుతున్నాను అని ప్రశ్న. చదువుల్లో దిగజారిపోయి నిరాశకు లోనైపోయాను. తిరగలేని చోట్లన్ని తిరిగాము ఎక్కడ సమాధానం దొరకలేదు. ఇక మా పరిస్థితి ఇంతే అని  అనుకున్నాము.

ఇలాంటి సమయంలో మా పెద్దమ్మ నిస్సీ చర్చికి వెళ్లేది. మా పరిస్థితిని గమనించి నీవు చర్చికి వస్తే బాగవుతావని చెప్పి చర్చికి తీసుకువెళ్లింది.  ఒక నెలలో మా అమ్మ క్రమంగా చర్చికి వెళ్లి బాగయ్యింది. ఒక ఆదివారం చర్చికి వెళ్తు నీవు వస్తావా? అని నన్ను అమ్మ అడిగింది. నేను రానంటే రాను ఆ దేవుడు మన దేవుడు కాదు అని చెప్పిఉండిపోయాను. మరో ఆదివారం ఎందుకో నాకు చర్చికి వెళ్లాలని అనిపించింది. నేను ఆదివారం చర్చికి వెళ్లగానే నా మనస్సుకు ప్రశాంతత దొరికింది. మరో ఆదివారం కూడా చర్చికి వెళ్లాను. భయంకరమైన జ్వరం వచ్చింది. ఆ జ్వరంతో నేను చాలా కృంగిపోయి పడుకొని ఏడుస్తున్నాను. ఆ సమయంలో అకస్మాత్తుగా ఎవరో ఒక వ్యక్తి నన్ను కౌగిలించుకున్నట్లుగా నేను చూస్తున్నాను. అదే సమయంలో ఒళ్లంతా చల్లగా అయిపోయి భయంకరమైన చెమటవచ్చి ఆ క్షణంలోనే నేను స్వస్థతపొందాను. అప్పటి నుండి నిజమైన దేవుడు యేసుక్రీస్తు అని తెలుసుకొని ఆయనను వెంబడించాను. అయ్యగారు ప్రార్థనద్వారా ఎంసెట్‌లో మంచి ర్యాంక్ వచ్చింది. హైద్రాబాద్‌లో మంచి కాలేజ్‌లో బి.ఫామ్ సీటు  వచ్చింది. 4 సం॥ల నా డిగ్రీలో రెండవ సంవత్సరము చదువుతున్నప్పుడు స్నేహితుల ప్రోత్సాహముతో ఫిల్మ్ ఇండస్ట్రీలోకి ప్రవేశించాలని

నిశ్చయించుకున్నాను. సినిమా జీవితమే మా గమనమని పట్టుదలతో ప్రయత్నాలు చేయడం ప్రారంభించాను. సినిమాల కొరకు కథలు, దర్శకత్వం, పాటలు సినిమాల్లో స్థిరపడడానికి కావల్సినవన్ని సిద్దపరచుకొని పెద్ద పెద్ద డైరెక్టర్‌ల దగ్గరకు వెళ్ళాను. అవకాశం ఇస్తానని చెప్పి అందరు మోసం చేసారు. ఒక సంవత్సరం అన్ని రకాలుగా ప్రయత్నించాను కాని చాలా కష్టం అని అనిపించింది. ఇక సమయం వృధా అవుతుందని ఆలోచించి అన్ని ప్రక్కనపెట్టి చదువుపై దృష్టిపెట్టాను. డిగ్రీ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను. పై చదువులకోసం అమెరికా వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. ఒక బి.ఫార్మసి కాలేజ్‌లో అసిస్టెంట్ ప్రొఫేసర్‌గా జాబ్ చేస్తూ అమెరికా వెళ్ళడానికి సిద్దపడ్డాను. 90% అంతా సక్రమంగా జరిగిందికాని వీసా పని జరుగుటలేదు. ఎంత ప్రయత్నం చేసినా ఆటంకాలు వస్తూనే ఉన్నాయి. నేను ఆ సమయంలో చాలా బాధపడుతూ మోకరించి ప్రార్థిస్తున్నప్పుడు దేవుడు నాతో మాట్లాడాడు. నీవు గుంటూరులో జరిగే సెమినార్‌కి వెళ్ళాలని చెప్పారు. ఆ సెమినార్‌లో దేవుడు నన్ను నా సేవ చేయమని మాట్లాడడం ప్రారంభించాడు. నేను చేయను నీ సేవ నేను చేయను అని దేవునితో బ్రతిమాలాను. అయినను పదే పదే మాట్లాడుతూ నేను నిన్ను వాడుకుంటాను అని చెప్పారు. దేవుని మాటకు లోబడి నీ సేవచేస్తానని తీర్మాణం చేసుకున్నాను. నేను మొట్టమొదట ఏమందిరానికి వెళ్ళి యేసయ్య గురించి తెలుసుకున్నానో అదే నిస్సీ మినిస్ట్రీస్‌లో దేవునిసేవ చేసే ధన్యత నాకు కల్పించాడు. నా గురించి నా సేవా పరిచర్యగురించి ప్రార్థించగలరని నేను మనవి చేస్తున్నాను. దేవుడు ఈ సాక్ష్యాన్ని దీవించునుగాక. ఆమెన్.

మీరు పత్రికయొక్క చందా ఇప్పటివరకు చెల్లించని యెడల దయచేసి వెంటనే చెల్లించవలయును. మీ చందాను మనియార్డరు ద్వారా పంపగోరినట్లయితే “నిస్సీజయధ్వజము, నిస్సీ మినిస్ట్రీస్, శాస్త్రీనగర్, నిర్మల్, ఆదిలాబాద్ **504106**” అనే అడ్రస్సుకు పంపించండి. మీ అడ్రస్సులో ఏదైనా మార్పు ఉన్నయెడల లేక క్రమముగా పత్రిక మీకు అందనియెడల మాకు వెంటనే తెలియజేయగలరు. మీకు పత్రికా ఆశీర్వాదకరంగా ఉన్నట్లయితే ఇతరులకు ఈ పత్రికను పరిచయం చేయండి.

దేవుడు మిమ్ములను దీవించునుగాక...

Regd. of Newspaper of India
TELTEL/2015/60909

Regd. No. ADB/012/2012-14
License to post on concessional rates

Printed matter

To,

# నిస్సీ మినిస్ట్రీస్

శాస్త్రీనగర్, నిర్మల్, ఆదిలాబాద్ 504106

ఫోన్ : 08734-240147, 9390011485

Website: www. nissi ministries.org

Email ID: nissi.ministries@yahoo.com

Published By: M. Priyadarshini W/o M. jayaraj, H.No. 1-3-132/A6
Shastrinagar, Nirmal, Adilabad Dist. Pin: 504 106

Edited Printed & Owned by: Pastor. M. Jayaraj, H.No. 1-3-132/A6
Shastrinagar, Nirmal, Adilabad Dist. Pin: 504 106